సాగరసంగం

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు

"కాటంరాజు మామా!"

"సోమాలా?"

"అవును మామా! ఏం చేస్తున్నావూ?"

"సావిడి తుడుస్తున్నాను. ఇలా వచ్చా వేం?"

"కాపుగారు జీతపుగింజలు కొలుస్తా మన్నారు. నేనూ వస్తా నుండు మామా!"

"ఇది యింతట్లో కాదు. గాది దిగితే యీవేళకి మళ్లీ యెక్కరు కాపుగారు."

"ఇవాళ కాకపోతే రేపిస్తారు. ఇంటో రెండు కుంచాల నూక లున్నాయిలే. వస్తాను మామా!"

"వుంటే మాత్రం పోనిచ్చుకోవడం యెందుకూ?"

"ఎక్కడికి పోతాయీ?"

"నువ్విక్కడ యిలాగ పొద్దు గడిపేస్తే మీ బాబు తిట్టడూ?"

"మా బాబు నలా అనకు మామా! వస్తున్నాను. 'ఊఁ' అను మరి."

"నీ కెందుకు సోమాలూ యీ కష్టం?"

"కష్టం యేమిటి కష్టం? కాకపోయినా మన లాంటి వాళ్లకి కష్టపడక తప్పుతుందా? రమ్మను మామా!"

"మీ బాబుకి మింతకి పొద్దెక్కి పోదూ?"

"మాలచ్చయ్యతాత కిచ్చే వచ్చాను."

"..............."

"ఏం? వచ్చేస్తున్నాను. ఊ! ఎంతసేపటికీ రమ్మనకపోతే యే మనుకున్నావు మరీ? నువ్వొక్కడవే కష్టపడుతూ వుంటే నేను చూడలేను మామా!"

"దయ వుండి కనక. ఛణంలో అయిపోయీదానికి నువ్వుకూడా చెయ్యి చేసుకోవడం యెందు కని గాని నువ్వంటే యిష్టం లేకా సోమాలూ?"

"ఇష్ట మన్న యిష్టమా? నా మీద నీ కిష్టమే లేకపోతే నేను బతగ్గలనా? ఆవేళ నువ్వు వెలగపండు కోసిపెట్టావు. ఎంత కష్టపడ్డావో అంత చిటాచిగురు కళ్లడానికి. వుడత లాగ నువ్వు వురక వేసుకుంటూ పైకి పోతూ వుండగా నా రాజా! నా మనస్సు యేలా పొంగిపోయిందో యేం చెప్పను మామా? ... ఎవళ్లూ యెక్కలేకే దాన్ని విడిచిపెట్టేశారు. ఈ వూళ్లో నీతో సమానంగా యెవ డెక్కగలడు మామా చెట్లూ?"

"లక్షమంది వున్నారు నా నొప్టనే పొడిచిందా పొద్దు? కాని సోమాలూ! పండు చేతిలో పెట్టాటప్పటికి నీ మొగమ్మీద మెరిసిపోయిందే సంతోసం? అది చూశాటప్పటికి నా రంగా! వొళ్లు తెలవలేదు నాకు."

"నేను చెప్పుకోవడం కాదు మామోయి! నా కోరిక తీర్చినందుకు నీ కాళ్లకాడ పడి చచ్చిపోవా లని తోచింది నాకు. బతికుండగా నీ రుణం తీర్చుకోగలనా కాటంరాజూ?"

"రుణమా? నీ దయ వుంటే నా కదే చాలు. ఆవే శేం? గాపితి వుందా? చెరుకుతోట కాడ నువ్వు కనపడకపోయినా, కనపడి పలకరించకపోయినా నే నీపాటి రంగంలోనో, మోల్మేనులోనో వుందు నుసూరు మంటూనూ. నువ్వు 'యెక్కడికి మామా?' అనేటప్పటికి నాకు నడుం లటుక్కు మనిపోయింది."

"నువ్వు చెప్పేదాకా బరమా వెళ్లడానికి బయలు దేరా నని నాకు తెలవనే తెలవదు. నువ్వావేళ వెళ్లే వుంటే నే నిప్పటిదాకా బతికి—ఏ నుయ్యో, ఏ గొయ్యో—మా మోయి! ఇం కెప్పుడూ అలాంటి తలంపు చెయ్యకు సుమా."

"ఇంకానా? ఇక యెవ రేనా గెంటినా—తోసేసినా వెళ్లగలనా? కానీ సోమాలూ! పెద్ద గందరగోళం పుడుతుంది."

"అందులో పడ్డవాళ్లు అందులోనే మగ్గిపోతారు చివరికి. మన కేం?"

"కాని వాళ్ల కెందుకూ మన గొడవలూ?"

"పూసిపోవద్దూ?"

ఇలాగ కభుర్లు చెప్పుకుంటూ కాటన్నా, సోమాలూ పేర్రెడ్డి పశువుల సాల బాగు చేస్తున్నారు. పాపం కాటన్న పని చేస్తూ వుంటే సోమాలు చూసి "నా కే" మని వూరుకోలేకపోయింది. "నేను సాయం చేస్తా" నంది." "ఏ మంటా" వంది. "రమ్మని పిలవ" మంది. "ఇక వుండలే" నంది. అయితే సోమాలు పని చెయ్యడం కాటన్న కిష్టం లేకపోయింది. వద్దంటే ఆమె మనస్సు చివుక్కు మంటుంది. రమ్మనడానికి తనకి నోరు రాదు. మాట మరిపించా లని చూశాడు; గాని లాభం లేకపోయింది. గంప అక్కడ పడేసి సోమాలు గభీ మని పనిలో వురికింది.

తరవాత యిద్దరూ పారవశ్యం కలిగించే పూర్వ పుసంగతు లేవో చెప్పుకుంటూ శ్రమ యెరక్కుండా పని చేస్తున్నారు.

౨

సరిగా యిలాంటప్పుడు పేర్రెడ్డి భార్య రంగమ్మ యాదాలాభంగా అక్కడికి వచ్చింది. ఆయిద్దర్నీ చూశాటప్పటి కామెకి ముచ్చ టయింది. ఆనందం మొగమంతా కమ్మేసింది. ముప్ఫయి సంవత్సరాల యువతి. సుఖమయకల్పనలు అతిజటిలంగా పుట్టే వయస్సు. పైగా, రంగమ్మ విలాసవతి; ప్రణయవతి. కానైతే వాళ్ల యిద్దరి మధ్యా అతిగభీర మైన అగడ్త వొకటి వుండడం నిజమే. అయినా పదిహే నేళ్ల పిల్లా, ఇరవై యేళ్ల పిల్లాడూ కులాసాగా కభుర్లు చెప్పుకుంటూ—రంగమ్మ తా నేదో పరమరహస్య మైన వొక సంగతి గ్రహించేశా ననుకుంది. "తొందరపడి యెదటికి వచ్చా" నని కించపడింది. అయినా వూరుకునే స్వభావంకా దామెది.

"నువ్వు కూడా తుడుస్తున్నా వెందుకే?"

"తుడవకూడ దండీ రంగయ్యమ్మగారూ?"

"నువ్వు సాయం చెయ్య మన్నావా యేమిటిరా?"

"కాపుగారు గాది యెక్కేరా అమ్మగారూ?"

రంగమ్మకి సూటైన జవాబుకి బదులు లౌక్యం యెదురైంది; కాని దానికంటే యిదే నయం. జవాబైతే డొంకల్లోకి యీడ్చుకుపోయి వుండును. ఇప్పుడు తన సందేహానికి బలకర మైన సన్నివేశం మూచాయగా కనపడింది. ఏదో లేకపోతే యీ లౌక్య మెందుకూ?

"పెళ్లి మాట లాడుకుంటున్నారా యేమిటే పిల్లా?"

"కాటన్న మాలా, నేను మాదిగ పిల్లనీని; ఎలాగండి రంగయ్యమ్మగారూ?"

"మా బాబుకి తెలిస్తే నన్ను చీరేస్తాడు. అసుమంటి మాట లనకం డమ్మగారూ."

"పోనీ దాని బాబుకి ఇష్ట మేనా?"

"పెద్ద కులం అయితే మాత్రం మా బాబు వొప్పుకుంటాడా రంగయ్యమ్మగారూ?"

"మీ మాట చెబుదురూ వేపాలకి పోకా."

దీనికి సమాధానం తోచక కాటన్నా, సోమాలూ మొగమొగాలు చూసుకుంటూ వుండగా పేర్రెడ్డి పిలుపుమీద పిలుపు చొప్పున నాలుగైదు మాట్లు పిలవడంచేతః యిష్టం లేకపోయినా విధి లేక, సిద్ధమైన ఫలాన్ని బోర్లతోసుకున్న దానిలాగ రంగమ్మ కాళ్లీడ్చుకుంటూ చక్కాపోయింది.

ఆమె వెళ్లిపోయాక సోమాలూ, కాటన్నా వొక్కమాటు ఫక్కున నవ్వుకున్నారు; కాని వెంటనే వారి మొగాలమీద అనంతగాంభీర్యం అలుముకుంది.

3

"నీ కూతురి కింకా పెళ్లి చెయ్యవుటరా గంగడూ?"

"చెయ్యకపోతే యెలా గం డమ్మగారూ?"

"మ రెప్పుడు చేస్తావూ?"

"ఏమీ తోచడం లేదండమ్మగారూ! నా బతుకు నట్టడివి అయిపోయింది కదాండి. పోతూ పోతూ యెంకిపిల్ల నా గొంతు కోసేసిం దండి. మా సోమా లింత కాచి పోస్తోంది కనక రోజులు దొర్లి పోతున్నాయి. యీ నాలు గేళ్లనుంచీ నే నేడవని రోజు లేదండమ్మా! సోమాలికి ఎప్పుడో వొకప్పుడు పెళ్లి చెయ్యక తప్పదు. చేస్తే మొగుడు మొన్నాడే తీసుకు పోతాడు. నాకు గంజినీళ్లకోసం బెంగ లేదు కానండి—ఏలినోరి గుమ్మం కనిపెట్టుకుంటే — నా కెంత కావాలండి రంగయ్యామ్మగారూ? తమ రింత గంజి పోస్తూ వుంటే నా కిదే చాలు. ఇక కూలీ అక్కర్లేదు, నాలీ అక్కర్లేమా. కానండి రంగయ్యామ్మగారూ! నా ఓడ్డ మాటే నండి. నేను చెప్పుకోవడం కాదు కానండి.—మహా నాజూకైన పిల్లండి. మాట పడదు. ఎంత పని చెప్పినా కష్ట మని చూడదు. దానికి తగిన మొగుడు దొరుకుతాడో దొరకడో. వచ్చిన వాడు దాన్ని నిబ్బరంగా చూస్తాడో చూడడో. తల్లి లేని పిల్ల. దాని రోజు లెలా వెడతాయో తోచడం లేదండి. మొగాణ్ణి నే నేం చూడగల నండీ అమ్మగారూ?"

"వొరేయి! అది లోకంతోపాటిది కాదు. దాని మాట పుచ్చుకోకుండా యెవణ్ణీ నిరుకు చెయ్యకు సుమా. నీకు చేత కాకపోతే నేను చూస్తాను తగినవాణ్ణి. మా గుమ్మంలోనే పందిరి వేయించి చేయిస్తాను దానికి పెళ్లి. పెళ్లికొడుకుని నువ్వు సొంతంగా చూసినా నాతో చెప్పకుండా మాట ఇవ్వకు."

"చిత్త మండి, చిత్త మండి. తమ కంత దయ వుంటే—"

"చూడూ గంగడూ! తీరుపా టయితే దాన్ని మా యింటి కెప్పు డేనా వస్తూ వుండ మనరా."

"ఇంత కంటేనా రంగయ్యామ్మగారూ? తప్పకుండా పంపుతా నండి. అది యింక పనికే వెళ్లదండి. ఆ పనీ, యీ పనీ చూసుకుంటూ యేలినవారి పాదాల దగ్గరే పడి వుంటుం దండి."

"తప్పకుండా పంపాలి సుమా:"

"చిత్త మండి."

"మరిచిపోకు."

"చిత్తం. మరి సెల వియ్యండి పొలం పోతాను."

"వెళ్లి రా."

గంగన్న వెళ్లిపోయాక "ఇదేలా సాగుతుందీ?... చేసి తీరాలి" అనుకుంటూ రంగమ్మ యింటోకి చక్కాపోయింది.

౪

గంగన్న పుల్లిట్లోకి వెళ్లేటప్పటికి సోమాలు నార్లంకపంపులో కోతిపిర్రల మామిడికింద చితుకు లేరుతోంది. కాటన్న చెట్టుమీద వుండి యెండిపోయిన రెమ్మలు విరిచి కింద పడేస్తున్నాడు. ఇద్దరూ అచ్చటా ముచ్చటా చెప్పుకుంటూ ఆనంద తరంగాలమీద వూగిపోతున్నారు.

బోదిగ దాటికెక్కేటప్పటికి గంగన్నకి ముందు సోమాలు కనపడింది. అనాసమడి తిరగవేసుకొని వెళ్లేటప్పటికి కాటన్న కిందికి వురికేడు. గంగన్నని చూసి వాళ్లిద్దరూ కూడా వులిక్కిపడ్డారు; కాని కాటన్న వెంటనే సమాళించుకొని "ఏం మామా? ఎందాకా?" అని అడిగాడు. సోమాలు మాత్రం మాట్లాడ లేకపోయింది.

"ఈచితుకు లన్నీ నువ్వు—"

"ఏం కష్టం?"

"అది కాదు కాటంరాజూ! నువ్వు విరిచినవి మీ యింటికి—"

"అ దేమన్న మాటా? మా అమ్మ పొద్దున్న మూడుగంపల తాటి టెంకలు పట్టుకు వెళ్లింది. నిన్న సందాల మాబాబు రెండుకావిళ్ల తాటికమ్మలు మోసుకు వెళ్లాడు. ఇంకా నేనుకూడా పట్టుకు వెళ్లాలా?"

"నువ్వు మంచివాడవు. వారందినాలు ఎలా తగులపెట్టినా—ఏం అమ్మో?"

"ఔను బాబూ! వారందినాలు బెంగ వుండదు. కాటంరాజుని తలుచుకుంటూ సుఖంగా కూచో వచ్చు."

"అలా వుండాలి విశ్వాసం. చేసిన మే లెప్పుడూ మరిచిపోగూడదు. కాటంరాజూ! నీసంగతి నాకు బాగా నచ్చింది. చేసుకున్న పెళ్లాన్ని మాబాగా సుఖపెడ తావు నువ్వు. చూస్తున్నాను కామా పేర్రెడ్డి కాఫుగారి కమతంలోకి వచ్చినప్పణ్ణుంచీనీ? కాపుగారికి నీమీద చాలా చాలా దయ."

"కాపుగారు చాలా మంచివారు మామా!"

"మంచన్న మంచా? నలభైయేళ్ళనుంచి వారి గుమ్మం కనిపెట్టుకుని వున్నాను నేను. రంగారెడ్డి కాపుగా రున్నప్పుడు నా కేమీ లోటు జరగలేదు; కాని ఆ మారాజుకంటే పేర్రెడ్డికాపు ఎంతో మంచివారు. రెడ్డిగారంటే ధర్మరాజనుకోవేం."

"అవు నవును."

"రంగయ్యమ్మగారు ఆమారాజుకి తగిన భార్య. ఆయమ్మకి చేతు లెత్తి మొక్కితే యెక్కడికి పోయినా కూడు పుడుతుంది."

"ఈ రైక నాకు రంగయ్యమ్మగారే యిచ్చారు. నెలా పదేను రోజుల కిందట కుట్టించుకున్నారుట. రూపాయి మూడు పావలా లయిందిట. 'తొడుక్కోవే పిల్లా' అంటూ మీద పడేశారు మొన్న."

"చూడమ్మో! నీకూ నాకూ ఆయమ్మే దిక్కు. ఆయమ్మని కొలుచుకుంటూ వుండు."

"అలాగే బాబూ."

ఇలాగ ఇంకా స్త సేపు మాట్లాడి గంగన్న బాడవలోకి వెళ్లిపోయాడు. పెద్ద ఆపద తప్పించుకున్నట్లు సోమాలూ కాటన్నా వొకరికేసి వొకరు చూసి పెద్ద నిట్టూర్పు విడిచారు.

తరువాత యిద్దరూ చితుకు లన్నీ తెచ్చి గంపలో పోసి కట్టారు. కాటన్న సాయం చెయ్యగా గంప యెత్తుకుని కట్లు చేర దేసి చేసుకొని వొక్కమాటు కాటన్నని నిలువునా చూసి, "వెళ్లిపోతాను మామా!" అంటూ సోమాలు బయలుదేరింది. కాటన్న మాట్లాడ లేక అలాగే నుంచోగా అంత బరు వెత్తుకునీ కూడా పది బారల కోమాటు నిలుస్తూ, మళుపుదాటేదాకా వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ చివరికి సోమాలు ఏదో వస్తువు పోగొట్టుకున్నట్లు బిక్కమొగంతో వెళ్లిపోయింది.

౫

మాల మాదిగల కందరికీ సోమాలు దర్శనం కరువైపోయింది. ఆమె కాకులు కూశాటప్పుడు విడిచిన గుడిసెకి రాత్రి పది దాటితే గాని చేరుకోవడం లేదు. తండ్రికి రాత్రంతా పొలం పని వున్నప్పుడామె గుడిసెకే వెళ్లడం మానేసింది. వెడితే అక్కడ ఆమె వొక్కత్తే పడుకోవడమే కామా? రెడ్డిగారి గాదుల సావట్లో పడుకుంటే వంట ముసలమ్మ యించక్కటి కథలు చెప్పి నవ్విస్తుంది. తొరగా పెళ్లాడ మనీ, మొగుణ్ణి యెలా సుఖపెట్టాలో, యెలా లోపు చేసుకోవాలో—ఇలాంటి వన్నీ చెప్పి వూరిస్తుంది. తెల్లవారితే రంగమ్మ యిక క్షణం విడిచిపెట్టదు. తండ్రి యింటికి రావడానికి వీ ల్లేనప్పుడు ముంత పట్టుకు వెళ్లడం తప్ప సోమాలికి బైట పనే లేదు.

సోమాలు వేషం పూర్తిగా మారిపోయింది. వారానికో తలగడుగు. ప్రతీ రోజునా తల దువ్వుకోవడం. రంగమ్మ కొంచెం నలిగిన చీర లన్నీ దాని కిచ్చేసింది. రంగమ్మే పట్టు పట్టి అందెలూ, కడియాలూ చెరిపించి ప్రత్యేకంగా కడియాలు చేయించింది. చేతుల నిండా గోకరజాక్ గాజులు; చెవులికి యెర్రపాళ్ల దుద్దులు; ముక్కులికి "అక్షు"లికి బదులు ముక్కుపుడకలు. మొత్తానికి మునుపు గాజు రాయిలాగ వుండిన సోమాలిప్పుడు పట్టెలు తీర్చిన నీలం లాగ నిగనిగ లాడుతూ మెరిసిపోతోంది. కాటన్న సోమాలిని మొదటి రోజున హఠాత్తుగా చూసి రెడ్డిగారిచుట్టం అనుకున్నాడు.

కాటన్న మునుపు పొలంపని నింపాదిగా చేసుకుని, నిదానంగా పాటలు పాడుకుంటూ వచ్చేవాడు.

ఇప్పుడు పొలంలో పని క్షణాలమీద అయిపోతోంది. పాటలూ, పద్యాలూ మూడోకాలంలో మెలికలు తిరిగి పోతున్నాయి. మునుపటి గూడ్సుబండి నడక యిప్పుడు మేల్గాడీ పరుగై పోయింది. ఏమంటే, రెడ్డిగారి యింటికి తొరగా వచ్చేస్తే సోమాలి నింకో మాపు యెక్కువ చూసుకోవచ్చు.

వొకనాడు అప్పుడే భోంచేసి వచ్చి బల్లమీద కూచుంటూ రెడ్డి చుట్ట అంటించాడు. కాటన్న యెదట నుంచుని కొత్తగా వచ్చిన నరెడ్లని గురించి ఏమిటో చెబుతున్నాడు. సరిగా ఆసమయంలోనే వచ్చి సోమాలు చిన్న పాలికాపు కేదో పురమాయిస్తోంది. ఆమెని చూశాటప్పటికి కేం తోచిందో యేమిటో, పేరెడ్డి కాటన్నతో, "వొరేయి! సోమాలు పెళ్లికూతురులాగ వుందిరా. నువ్వింకా గోచీగుడ్డతో ఘోటక బ్రహ్మచారి లాగే వున్నావు" అన్నాడు. అప్పుడే వాకట్లో అడుగు పెడుతూ వున్న రంగమ్మ అది విని, "సోమాలు పెళ్లికూతురులా వుంటే మీరు కాటణ్ణి పెళ్లికొడుకుని చెయ్యం"డంది. దానిమీద రెడ్డి "అవునా?" అని అడగ్గా కాటన్న "యెప్పటికేనా నాకు పెళ్లి చేసే పూచీ యేలినవారిదే" అన్నాడు. అందుకు రంగమ్మ "సోమాలికి పెళ్లికొడుకుని చూడవలసిన భారం నామీదా, కాటడికి పెళ్లికూతుర్ని తేవడం పూచీ మీ మీదా పడిందండోయి" అంటూ నవ్వింది. "అయితే యిక ఆలోచన యెందుకూ! సోమాలిని పెళ్లాడతావుటరా మరీ?" అని రెడ్డి అడిగాడు.

ఆమాట వినేటప్పటికి కాటన్న హృదయం గుబగుబ లాడిపోయింది. సోమాలి గుండెలు దుడుకూ దుడుకూ కొట్టుకున్నాయి. సోమాలు కాటన్న కేసి చూసింది. కాటన్న సోమాలి కేసి చూశాడు. ఆ రెండు చూపులూ కలిశాటప్పటికి వాకలంతా మెరుపు మెరిసినట్లయిపోయింది. రెడ్డిదంపతుల కళ్లు మిరుమిట్లు కొన్నాయి.

సోమాలు, ఎక్కడలేని సిగ్గు వచ్చి, గోడచాటుకి పోయి, "నువ్వు పొలం వెళ్లిపో" అన్నట్లు తల వూపింది; కాని కాటన్న కదలలేదు. రెడ్డి తెచ్చిన ప్రస్తావనవల్ల కాటన్నకి గొప్పరాజ్యం వచ్చినట్లుంది. ఇంకా యెదటే వుంటే రెడ్డి యింకా యెలాంటిమాట లంటాడో? అసలు ధోరణి ఇలా మార్చేసిన రంగమ్మ చివరి కెలా తేలుస్తుందో?

ఇదేమిటో చూస్తే కాని కాటన్న అక్కణ్ణుంచి కదల తలుచుకో లేదు. అయితే యింతట్లో గంగన్న వచ్చి కాటన్నని పొలం తీసుకు చక్కాపోయాడు. చేసేది లేక కాటన్న కాళ్లీడ్చుకుంటూ వెళ్లాడు.

"అల్లుడూ, మామగారూను."

"నిజమే అంటావా?"

"బాగానే వుంది. ఇంకా బోధపడ లేదుటండీ?"

"బోధపడింది; కాని అంత పని జరుగుతుందా?"

"మీరు కలగ చేసుకుంటే పెళ్లి. లేకపోతే స్వయంవరం."

"అబ్బా!"

"పున్నమి వెడితే కాటడు రంగం దూకేస్తాడు."

"సోమాలు?"

"వాణ్ణి కదిపేదే అదీ."

"అయితే యిక చూస్తూ వుండు."

ఇలా చెబుతూ రెడ్డి పొలం వెళ్లిపోయాడు. ఆవేళ అస్తమానూ అతనికి ఇదే ఆలోచన.

౬

ఇక్కడ యిది యిలా వుండగా అక్కడ మాలపిల్లిలో కొంప లంటుకున్నాయి. "కాటన్న పనేమీ బాగా లేదంటోయి నరిసీములూ" అంటూ, మూడు కాళ్ల ముసలి సోమన్న వచ్చి నిప్పు రాజేశాడు. తరవాత చంద్రన్న వచ్చి "మీవాడు కులం చెడ్డాడన్న మాటే" అంటూ ఆనిప్పు వూదాడు. నిలవతీసి అడగ్గా, "మీవాడు సోమాలిచ్చిన నీళ్లు తాగాడంటోయి" అని బుచ్చన్న చెప్పాడు. "మొన్న చద్దికూట్లో సోమాలిచ్చిన చింతచిగురు పచ్చడి నంజుకున్నాడంట కాటన్న" అని సీతన్న చెప్పాడు. "మీవాడికి సోమాలు

ముంత అందిస్తూ వుండగా శానామంది మాశారంట కాపులు" అని పోతురాజు ఝాడించి చెప్పగా, "ఇక కులమా? కొడుకా?" అంటూ టకాయించి అడిగి సోమన్న చక్కాపోయాడు.

నరిసీములికి కొండ విరిగి మీద పడ్డట్టయింది. ఒక్క కొడుకు. గారాల కూచి. తనకి ముసలితనం అలుముకుంది. అన్నిటికీ యిక కాటన్న రెక్కలే ఆధారం. తిండి మాట కేం? ఆవొక్క కొడుకూ తన నింత బూడిద చేస్తాడా చెయ్యడా?

అతనికి వెన్నెట్లోనించి చీకట్లో పడ్డట్టయిపోయింది. కులం అయితే యెలాంటి పిల్లయినా సమాధానపడవచ్చు. పెద్ద కులం అయితే పేచీలు వచ్చినా కులం చెడదు. ఇదేమిటి యిది? ఎటు మాసినా సర్వనాశమే. కూడు లేకపోయినా బతకవచ్చు; గాని కులం లేకపోతే యెలాగా?

నరిసీములు యిలా కుమిలిపోతూ వుండగా నీళ్ల కడవ పట్టుకొని పోలమ్మ వచ్చింది. పెనిమిటి మొగం మాశాటప్పటి కామె కేదో భయం కలిగింది; కాని అడుగలేకపోయింది. పోలమ్మని మాశాటప్పటికి నరిసీములికి కళ్లు నీళ్లు కమ్మాయి. అది చూసి పోలమ్మ యిక నుంచోలేక, కడవ అక్కడే దింపేసి, పెనిమిటి దగ్గర కూచుని, "ఏం? యెందుకూ? యేం వచ్చిందీ?" అని అడిగింది. ఒకటి రెండు నిమిషాల పాటు నరిసీములికి మాట తిరిగింది కాదు. ఆస్థితి చూసి పోలమ్మ దుఃఖిస్తూ మీద వాలగా బ్రహ్మాండంమీద నరిసీములు జరిగిం దంతా చెప్పాడు.

"ఏమిటే" అంటూ పోలమ్మ వులికిపడింది.

"ఏడవకు, ఇది నిరుకా? కిట్టనివాళ్లు కల్పించి వుంటారు."

"నిరుకైతే యేమిటి చెయ్యడం?"

"కాటన్న నాదగ్గిర ఏమీ దాచడు. అడుగుదాం."

"నిజమే చెబుతా డనుకో. నిరుకైతే? కులం మాట చెప్పు. 'కులమా? కొడుకా?' అని అడిగాడు చింతన్నగారి సోమన్న."

"ఇటు మాలలకీ, అటు మాదిగలకీ కూడా దూరమైపోతాం" అని నరసీములు దీనంగా అన్నాడు.

"అందుకోసం వాళ్ళ నిద్దరినీ విడదీస్తే పాపం కాదూ?" అని పోలమ్మ అడిగింది.

నరిసీములు మాట్లాడలేకపోయాడు. ప్రేమోపాసన అతని మనస్సుని మృదువుపరిచి వుంది. అయినా అధైర్యం పోలేదు. ఇది కనిపెట్టి పోలమ్మ "యిక్కడ కాదు" అంటూ అతగాణ్ణి గుడిసెలోకి తీసుకుపోయింది.

౭

పోలమ్మా, నరిసీములూ కూడా దీన్ని గురించి చాలా రహస్యంగానే ఆలోచనలు చేశారు. కాని యిది పూర్వస్మృతి నరిసీముల్ని గుంజేసి విడిచిపెట్టింది. బొబ్బిలికథ పాడడంలో నరిసీములికి వున్న నేర్పుచూసి పోలమ్మ, చేస్తూ చేస్తూ వున్న పండు వంటి కాపరం విడిచిపెట్టి నరిసీములుమీద వాలింది. నిక్షేపం లాంటి మూడు యకరాల భూమి ప్రేమ యెదుట ఆమెకి గడ్డిపరక లాగ కనపడింది. తండ్రి గదిమాడు; అన్నదమ్ములు పాడిచేస్తా మన్నారు. వదినలూ, మరదళ్లూ దెప్పిపొడిచారు తల్లి గొల్లున గోలపెట్టింది. మొగుడు ఛార్జీ యివ్వడానికి సిద్ధపడ్డాడు; కాని పోలమ్మ విన లేదు. జంకనూ లేదు. నరిసీములు అప్పుడు విజయగర్వాన్ని చూపించాడు. అయితే అది కులంలో కులం కనక సరిపోయింది. ఇప్పుడు?

"కొడుకే అని చెప్పలేకపోయావా?"

"అయితే ముందు దారి?"

"కులం కూడు పెడుతుందా? వొక్క కొడుకు. మాట తీసెయ్యడం యెరగడు. రాచకొమారుడులాగ వుంటాడు. మొగం మాస్తేనే కడుపు నిండిపోతుంది."

"అంచేతనే సోమాలు కన్నేసింది."

"అబ్బరమా? నే సెయ్యలేదూ నీ మీదా? యకరం భూమి అమ్మగారిగీ, యేదుం భూమి అక్కడిదీ వొదులుకో లేదూ నీ కోసం? కోరుకున్న పెనిమిటి దొరికితే కుల మెందుకూ? కూ డెందుకూ?"

మాలపిల్లీ, మాదిగపిల్లీ కూడా పాకిపోయింది. ఎక్కడ చూసినా యిదే గొడవ. చివరికి మాలపెద్దలు నరిసీ ముల్ని అడిగినట్లే మాదిగపెద్దలు "ఏం చెబుతావోయి దీనికీ?" అని గంగన్నని నిలవదీసి అడిగారు.

గంగన్న వులిక్కిపడ్డాడు. ఇప్పటి కింకా అత గాడు తన కూతురు చిన్నపిల్లే అనుకుంటున్నాడు; గాని ఆమె ప్రణయాభరాలస అయివుందని గ్రహించలేదు. మొదణ్ణుంచీ గంగన్నకి ఏడుకొండలవాడిమీద వున్నంత ధ్యానమూ, దృష్టీ మరి దేనిమీదా లేదు. పెళ్లాం బతికి వున్నప్పుడు ఆతను సంసారంకేసే చూడలేదు. కూలో, నాలో తీసుకువచ్చి చేతిలో పొయ్యడమూ, ఆమె భోజనం చెయ్యమంటే చెయ్యడమూ, కాపుగారి పని మితి యెరక్కుండా చెయ్యడమూ, హాయిగా పడు కోడం,—ఒక్క నిద్రపోయాటప్పుడు తప్ప తక్కిన అన్ని సమయాలలోనూ వెంకన్నబాబుని తలుచుకోడం, పాడుకోడం—ఇంతకంటే అతను మరో పని యెరగడు. అంచేత అతను జరుగుతూ వున్న సంగతు లేమీ గ్రహించ లేదు. పైగా రెండుమాసాల కిందట దగ్గరిచుట్టం వొకడు వచ్చి తన కొడుక్కి సోమాలి నిమ్మని అడగ్గా, "చిన్న పిల్ల. దాని కిప్పుడే యేం పెళ్లి బావా?" అని కూడా అని వున్నాడు. అలాంటివాడు ఇలాంటి ముదలకింపు విని వులిక్కి పడడంలో ఆశ్చర్యం యేం వుందీ?

మునుపటి లాగే అత నిప్పుడు కూడా కులపెద్ద లతో "చిన్నపిల్ల. దాని కేం తెలుస్తుందీ? మీరు చెప్పుడు మాటలు విన్నారు" అన్నాడు; కాని వాళ్లు అంతటితో విడిచిపెట్టలేదు. ఆపెద్దలికి కులంమీద వుండే అభిమానం కంటే సోమాలిమీద అసూయ హెచ్చయి పోయింది. ఉప్పు లేకుండానే ముప్పందుం రకంలో చేరిన కుల పెద్దలు భీష్మించా రంటే ఆశ్చర్యం యెందుకూ?

ఆడాళ్లయితే యేమి, మొగాళ్లయితే యేమి, యిరవై మంది దాకా గంగన్నని ముట్టడించారు. రెండు గంటల సేపు తర్జనభర్జన చేశారు. ఎంత సేపూ గంగన్న "మా పిల్ల అలాంటిది కా" దంటాడు. కులపెద్దలు "బుకా యించ" కంటారు. "జాగ్రత్త" అని వాళ్లనరు. "కూక లేస్తా" నని యితగా డనడు. చివరికి వ్యవహారం సుతి మించిపోయింది. "వారంరోజుల్లో నీకూతురికి పెళ్లి చెయ్యకపోతే కులంలోనుంచి నిన్ను కేటాయించేస్తా" మని ఖచితంగా చెప్పి వాళ్లు వెళ్లిపోయారు.

గంగన్నకి కష్టం తోచింది. ఎటు చూసినా యేమీ కనపడలేదు; కాని హఠాత్తుగా రంగమ్మ అనిన మాట నెమరుకి వచ్చింది. "కాపుగా రప్పు డలాగ యెందు కన్నారో యెరుగుదువా?" అని యెవరో అడిగి నట్లు కూడా అయింది.

గంగన్న యిక నుంచో లేకపోయాడు. "రంగ య్యమ్మగారి నడిగితే అంతా తేలిపోతుం" దని నిశ్చ యించుకొని బయలుదేరాడు. మనస్సు చిమచిమలాడి పోతోంది; గాని నాలిక మాత్రం "ఏడుకొండల వాడా! గోవిందా, బాబు" అని అందుకుంది.

పది బారలు వెళ్లాడు. పాట ఏ డెనిమిది చర ణాలు నడిచింది. అప్పటికి కొత్త గోదావరి నీటిలో యిండుగు గంధం కలిపిన ట్లయింది. మరో పది బారలు వెళ్లాటప్పటికి బుద్ధి నావరించుకుని వున్న కల్మషానికి దిగతీత మొదలయింది. తిరపతి స్టేషను సమీపిస్తూ వున్నట్లూ, యాత్రీకుల గోవిందబొబ్బలతో భూనభోంత రాళాలు నిండిపోతూ వున్నట్లూ తోచింది. దీనితో గంగన్న, శరీరం మరిచిపోయాడు. అన్యచింతలు తుడిచి పెట్టుకుపోయాయి.

అలాగ పారవశ్యంతోటే నడిచి అతను పేరెడ్డి గుమ్మంలోకి వెళ్లాటప్పటికి రెడ్డి కొత్తగా అచ్చుపోసి విడిచిపెట్టిన ఆబోతుకి రంగమ్మ దగ్గిర వుండి సోమాలిచేత వులవగుగ్గిళ్లు పెట్టిస్తోంది.

ఈదృశ్యాన్ని చూశాటప్పటికి గంగన్నకి వెంకట రమణమూర్తి సాక్షాత్కరించినట్లే అయిపోయింది. వెంటనే పాటకి స్థాయి హెచ్చించాడు. వొట్టి చేతుల తోటే తాళం వేస్తూ, గజ్జెలు లేని కాళ్లతోటే నృత్యాం చేస్తూ ఆవృషభానికి ప్రదక్షిణం ప్రారంభించాడు. అది కొత్తదైతే కొంచెం బెదరి వుండును; గాని చిన్నప్ప ణ్ణుంచీ కూడా దానికీ గంగన్నకీ చాలా స్నేహం.

అసలు గంగన్న ప్రోత్సాహంచేతనే పేర్రెడ్డి దాన్ని అచ్చోసి విడిచిపెట్టాడు. అంచేత అది నదురూ బెదురూ కూడా లేకుండా తాపీగా దానా తిని వీథిలోకి బయలు దేరింది. చెరువు గట్టుమీదికి వెళ్లేదాకా దానికూడా నే వెళ్లి, తరవాత గంగన్న పల్లప్పాలం వెళ్లిపోయాడు.

౫

పోలమ్మ సంగ తంతా చెప్పి మధురాన్ని సలహా అడగ్గా, మధురం దేవసహాయానికి చెప్పి, "నువ్వు కలగ చేసుకో" అంది.

దేవసహాయం అంటే ఆదిలో కులానికి దేవాంగి. పేరు దేవయ్య. పదమూడో యేట తల్లిదండ్రు లిద్దరూ వొక్కమాటే చచ్చిపోయారు. ఇటూ అటూ కూడా అతనికి "నా" అన్నవా ళ్లెవరూ లేకపోయారు. అయి నా కులవృత్తిలోనే కూలిపని చేసుకుంటూ అత నెలాగో కాలం గడపేస్తూ వుండేవాడు.

ఇలా వుండగా పద్దెనిమి దేళ్ల వయస్సులో అత నోమాటు ద్రాక్షారం సంతనుంచి వస్తూ రామచంద్రపు రానికీ, పసలపూడికీ మధ్య కలరా వచ్చి పడిపోయాడు. కులస్థులు కొందరు కూడానే వస్తు న్నా రు; గాని భయంవల్ల విడిచి పెట్టి పారిపోగా వొక మిషనరీ చూసి, తీసుకువెళ్లి, చికిత్స చేసి బతికించాడు. గ్రామ స్థులూ, కులస్థులూ అయినవా ళ్లలా చెయ్యగా ఎక్క డో పాతాళంలోనుంచి వచ్చిన కిరస్తానీదొర యిలా చెయ్యడం అతని విశ్వాసాన్ని తిప్పేసింది. వెంటనే దేవయ్య మతంలో కలిసి దేవసహాయం అయిపోయాడు.

తరవాత నాలుగేళ్ల కతను రాయవరంలోనే కిరస్తానీల పాఠ శాలలో పంతులుగా ప్రవేశించాడు. అప్పటి కతను బ్రహ్మచారే; కాని వచ్చిన యేణ్ణర్థానికే గృహస్థు అయినాడు. వెలమ కులం మారెమ్మ మొగుడు చచ్చిపోగా మతంలో కలిసి, మధురం అయి, దేవసహా యాన్ని చెట్టపట్టింది.

అది మొదలు ప్రణయంతో లంకె వేసి భిన్నకులా లకు చెందిన యువతులనూ, యువకులనూ మతంలో చేర్చా లని అతను నిశ్చయించుకున్నాడు. ఈనిశ్చయం అక్క డక్కడ కొంచెం ఫలోన్ముఖంగానే వుంది; కాని యిది అతనికి కేవలమూ కొత్త.

"నాకొడుక్కి దారి చూపించండి బాబయ్యా" అంటూ పోలమ్మ కాళ్లమీద పడింది. "నాకు గతేమిటి పంతులుగారూ?" అంటూ నరిసీములు చేతులు పట్టు కున్నాడు. దీనితో దేవసహాయానికి రక్తం వుడు కెత్తి చర్రుమంది. వొక్క నిట్టూర్పు విడిచా డతను. గుక్క తిప్పుకోకుండా వొక్క అరగంట యేకబిగిని క్రీస్తుమతా న్ని గురించి వుపన్యాసం చేశాడు. దేవుని కరుణకి చాలా వుదాహరణాలు చూపించాడు. తన సంగ తంతా పూస గుచ్చినట్టు యేకరువుపెట్టాడు. ఆవృద్ధదంపతులికి తెలి సిన హిందూమతాన్ని తుక్కుతుక్కు కింద యేకేసి విడిచిపెట్టాడు. సోమాలూ, కాటన్నా భార్యాభర్తలు కావడం దేవుని సంకల్పం అన్నాడు. దానికి భిన్నంగా నడిస్తే మీకు నరకం వస్తుం దన్నాడు.

ఈసందర్భంలో మధురం కూడా చిన్నవుపన్యా సం చేసింది. "దేవుని దయవల్లనే నేను మతంలో కలి శాను. కులమో, కులమో అంటే కులం కూడు పెడు తుందా గుడ్డ యిస్తుందా? దేవుని రాజ్యంలో కులాలు లేవు. అక్కడ అంతా సమానమే. మీ హిందూమతం లో మట్టుకే యీపుట్టిమునక వుంది. మా మతం కంటే మంచిమతం మరెక్కడా లేదు. మీ కాటన్న కూడా మతంలో కలిశాడంటే రెండు మూ డేళ్లలో పంతులుగా రయిపోతాడు. సోమాలు పంతులమ్మ అవుతుంది. వా ళ్లిద్దర్నీ విడతీస్తే దేవునికి కోపం వస్తుంది. పైగాసోమా లిని పెళ్లిచేస్తేనే మీ కాటన్న మీకు తక్కుతాడు. బాగా ఆలోచించుకోం" డని యిలాగ మధురం కళ్లు తిప్పుకుంటూ చెప్పగా పోలమ్మ వుద్రేకం పొంది మొగు డుకేసి చూసింది. దానిమీద నరిసీములు, రక్తం వుడు కెత్తగా, "అలా అయితే మేమూ మతంలోనే కలుస్తా" మన్నాడు.

౬

"నాకు మహా గట్టిచిక్కు వచ్చిందండి రంగయ్య మ్మగారూ!"

"చిక్కా?"

"చిక్కన్న చిక్కు కాదండి. యిక బతికేయో గం లేనట్టుం దం డమ్మగారూ!"

"ఏమిటిరా అదీ?"

"కులంలోనుంచి నన్ను కేటాయించేస్తారుటండి పెద్దలు."

"యేం వచ్చిందనీ?"

"సోమాలు కాని పనులు చేస్తోందిటండి."

"అంటే?"

"మాపిల్ల కాటంరాజుకి యిలాకా పడిందనీ—"

"ఛీఛీ! ఎవళ్లురా అలా పేలుతున్న వాళ్లూ?"

"కులం అంతా యిదే మాటండి."

"పొగరెక్కి వున్నారే?"

"నా శేలినోరి ఆసరా వుంది గనక కానండి, లేక పోతే నిమిషాలమీద గెంటేస్తు రం డమ్మగారూ!"

సరిగ్గా యీ సమయంలో "యెవళ్లురా నిన్ను గెంటేసే వాళ్లూ? ఆడది యేలుతోందిటరా రాజ్యం?" అంటూ సింహనాదం చేస్తూ పేర్రెడ్డి వచ్చాడు. అది చూసి రంగమ్మ సంగతంతా చెప్పి, "మీరు కలగచేసుకోవాలి" అంది. దానిమీద రెడ్డి "లేకపోతే వాళ్ల ఆటలు సాగ నిస్తానా నేనూ? వోరే గంగడూ! అసలు సంగతేమిటో గ్రహించావా? సోమాలు చుట్టంలాగ మాయింటో వుండి సుఖపడుతోంది. దానికి కులంలో యెవరికీ లేని అదృష్టం పట్టింది. అందుకోసం యేడుస్తున్నారు మీవాళ్లలాగ. మళ్లీ యేమేనా అన్నారంటే నాతో చెప్పు, తప్పిపాతేస్తాను" అని ధైర్యం చెప్పి, "ఇక్కడ కాదు. పుల్లిట్లోకి వెడదాం రా" అంటూ బయలుదేరాడు. "ఏలినోరు యెలా చెయ్యమన్నా యిష్టమేనండి నాకు. మీరే పబువులూ, మీరే దేవుడూ నాకు" అంటూ గంగన్న రెడ్డి కూడా వెళ్లాడు.

* * *

వీరిద్దరూ వెళ్లేటప్పటికి కాటన్న చేనిగట్టుమీద కూచుని చద్దన్నం తింటున్నాడు. ఎవరూ కూడా మాట్లాడలేదు; గాని కాటన్నని చూశాటప్పటికి గంగన్నకి మనస్సు గుబగుబలాడి పోయింది. ఇది కనిపెట్టి, యిక అక్కడ నుంచుంటే అనవసర ప్రసంగం రావచ్చు నని గంగన్నని తీసుకుని రెడ్డి ముందుకి వెళ్లిపోయాడు.

౧౦

రంగమ్మా, సోమాలూ గాది సావిట్లో కూచుని పసుపు దుంపలు బాగుచేస్తున్నారు. రంగమ్మ మొదట లోకాభిరామాయణం కొంత సాగనిచ్చి చివరికి పెళ్లిగొడవలోకి దింపేసింది.

"..............."

"మాట్లాడవేం?"

"ఏం చెప్పమంటా రండమ్మగారూ?"

"సిగ్గెందుకే? నువ్వు ఇంకొకణ్ణీ, కాటడు మరొకత్తినీ పెళ్లాడితే మీకిద్దరికీ సుఖం వుండదు. తరవాత యిద్దరూ యేడుస్తారు. కనక ధైర్యం తెచ్చుకోవడం మంచిది."

"పెళ్లాడితే కులంలో వుండనిస్తారాండి?"

"లేచిపోతే వుండనిస్తారా?"

"..............."

"ఇక కులం యెలాగా వుండదు. అయినప్పుడు పెళ్లాడితేనే మంచిది కాదూ?"

"..............."

"చూడూ మారెమ్మ యెలా సుఖపడుతోందో నూ?"

"మధురమ్మగారు మతంలో కలిశారు."

"మీరు కూడా కలిస్తే సరీ."

"మా బాబు గతేమిటండి మరి?"

"నువ్వు లేచిపోతే గతేమిటి!"

"........................"

"........................"

"ఇలాగే వుండిపోతే నోండి?"

"పెళ్లాడకుండానా?"

"........................"

"లేచిపోకుండానా ?"

"........................"

"కాటణ్ణి మరిచిపోయా ?"

"........................"

"వుండగలవా నువ్వా ?"

"........................"

"పెళ్లి లేకుండా వుండనిస్తారా నిన్ను కులం వాళ్లూ ?"

"........................"

"మీ బాబుమాత్రం వొప్పుకుంటాడా ?"

"........................"

"రెడ్డిగారిని పిలవనా ?"

"వారిదగ్గిర నే నేమాటా చెప్పలేనండి"

"కొడతారా తిడతారా? నువ్వా, కాటడూ పెళ్లాడి సుఖంగా వుంటే చూడాలని వుంది రెడ్డిగారికి."

"మా సంగతంతా—"

"ముందు వారికే తెలిసింది."

"........................"

"పిలవనా ?"

"వొద్దం డమ్మగారూ! మీ కాళ్లకి మొక్కుతా నండి. ఈగొడవ వారియెదట మాట్లాడలేనండి. పిలవకండి. మీ రెలా చెబితే అలా వింటానండి. ఏం చెయ్యమంటే అది చేస్తానండి. మీదగ్గిర దాచడం యెందుకండీ యింకానూ? అమాస వెళ్లాక రంగం వెళ్లిపోవాలని నిరుకు చేసుకున్నామండి మేము."

"ఏమిటే ?"

"నమ్మం డమ్మగారూ ?"

"ఇక్కడ వుండరూ ?"

"ఇంకెందుకండీ ? ఏలినోరు మమ్మల్ని కాపాడతా మంటే యిక్కడే వుండిపోతామండి. కాటంరాజు కూడా మీమాటకి అడ్డు చెప్పడండి."

"అలా చెప్పు. మీ కేమీ భయం లేదు. ఏమీ లోటు జరగదు. మిమ్మల్ని బతికివున్నంతకాలమూ నేను పోషిస్తాను. మీ కేమీ చిక్కులు రాకుండా రెడ్డిగారు వెయ్యికళ్లతో కనిపెడుతూ వుంటారు."

"చిత్తమండి."

"యిక లేచిపోవడం మాట—"

"ఇంకెందుకండీ? ఇక్కడే వుండి పోతామండి."

"కాటడితో నువ్వు చెబుతావా, నేను చెప్పాలా?"

"నేను చెబుతాను లెండి."

"మరి వెళ్లి మాట్లాడిరా."

"ఆనక మాట్లాడకూడ దండీ?"

"ఆలస్యం యెందుకూ? వారంరోజుల్లో పెళ్లయిపోవాలి మీకు? ఇంకా యెన్నాళ్లూ గుటకలు మింగుతూ కూచోడం?"

"............"

"సిగ్గుపడకు. కాటడు అరిటిమొక్కలికి నీళ్లు తోడుతున్నాడు, వెళ్లి మాట్లాడి రా."

"............"

"నువ్వు వచ్చేదాకా నే నిక్కడే వుంటానుసుమా."

"చిత్తమండి."

"తొరగా —పోనీ సావకాశంగానే మాట్లాడుకోండి పాపం."

సిగ్గుచేత సోమాలు హంసపిట్టలాగ తక్కుతూ, తారుతూ వెళ్లడం చూసి, "మనస్సులు కలిసిపోయాయి పాపం. విడతీస్తే పాపం కాదూ? బలవంతాన్నైనా విడతియ్యడం సాధ్యమౌతుందా? రంగం దూకేస్తే? ...... పెళ్లి చేసి తీరాలి" అనుకుంటూ రంగమ్మ అక్కడే కూచుంది. సోమాలు సందుగుమ్మం దాటేదాకానే నింపాదిగా వెళ్లి తరవాత పురకలు వేసుకుంటూ నూతి దగ్గిరికి వెళ్లింది.

౧౧

"వాళ్ల పూచీ అంతా నాదీ" అని రెడ్డి దృఢంగా చెప్పగా, గంగన్న కాటన్నకి సోమాలి నివ్వడానికి వొప్పుకున్నాడు. "మేము వుండగా మీ కేం భయమురా?" అని రంగమ్మ చెప్పగా కాటన్న దేశంలోనే —వూళ్లోనే వుండిపోడానికి వొప్పుకున్నాడు. "నీకు మురుగులూ పట్టెడా చెయ్యమని కంసాలిసన్నాసికి రెడ్డిగారు కాసు లిచ్చేరే" అని వంటలక్క చెప్పగా సోమాలు పొంగి పోయింది.

రెడ్డి అప్పుడే భోజనం చేసి వచ్చి, బల్లమీద కూచుని చుట్ట అంటిస్తూ వుండగా దేవసహాయం వచ్చాడు.

"మీకోసం వచ్చానండి."

"నీకోసం కబురు పంపా లనుకుంటున్నాను."

ఇలా అంటూ యిద్దరూ యీసంగతే అందుకున్నారు.

*   *   *   *

తరవాత వారం రోజులు వెళ్లాక యాకూబూ, దావీదూ మురుక్కాలవగట్టున కూచుని చాలా కష్టంగా మాట్లాడుకున్నారు.

"దొరగారు మంచిపని చేశారు కారు."

"ఇలా జరుగుతుందని నే నెప్పుడూ అనుకోలేదు."

"మాలాడికీ మాదిగదానికీ పెళ్లా? ఎక్కడేనా జరిగిందా యిలాగా?"

"మతంలో కలిశాక యిక కుల మేమి టంటున్నారు దేవసహాయంగారు. విన్నావా?"

"ఆయన మరీనీ. ఇదంతా ఆమొగుడూ పెళ్లాలే చేశారు."

"పిల్ల దొరక్క ఆయన కులం చెడ్డాడు. అందర్నీ తనతో సమానం చేసుకోవాలని ఆయని యిలా చేశాడు. ఛీ! కిరస్తానీ మతం మంచిది కాదోస్."

"అవునోస్."

మా చందాదారులకు

మా కార్యాలయమునకు వ్రాయు ఉత్తరములు మొదలయినవానియందు తమ 'చందాదారు' సంఖ్య వ్రాయవలెను. లేకున్న ప్రత్యుత్తరములు మొదలయిన పనులను జరుపజాలము. చందాదారుసంఖ్య భారతి కవరుకాగితముపై తమ విలాసమునకు ముందున్నది. చందాదారులకు భారతి ౧౦-వ తేది లోపల అందకపోయిన యెడల వెంటనే తపాలువారికిని, మా కార్యాలయమునకును తెలుప గోరెదము.

---. మేనేజరు, 'భారతి.'